## ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



ఎమ్మెల్సీ కవిత జన్మదినం సందర్భంగా అసెంబ్లీలో కేక్ కట్ చేసి తినిపిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను గురువారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ జాగృతి నాయకులు ఘనంగా నిర్వహించారు. అసెంబ్లీ ఆవరణలోని మండలి, శాసనసభ ప్రతిపక్ష నాయకుల చాంబర్‌లలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సమక్షంలో ఎమ్మెల్సీ కవిత వేర్వేరుగా కేక్ కట్ చేశారు. సభ్యులు ఆమెకు కేక్ తినిపించి, పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు సురభివాణీదేవి, మహమూద్ అలీ, శంభీపూర్‌రాజు, నవీన్‌రెడ్డి, గొరటి వెంకన్న, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లారాజేశ్వర్‌రెడ్డి, కోవలక్ష్మి, కౌశిక్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్ పాల్గొన్నారు. పర్యావరణవేత్త, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపు మేరకు తెలంగాణభవన్ వద్ద టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రా నంద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మహిళా నేతలు మొక్కలు నాటారు. పూరి తీరంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో కళాకారులు వేసిన ఎమ్మెల్సీ కవిత శిల్పం సందర్శకులను ఆకట్టుకుంది. సైకత శిల్పంలో 'ది ఫేస్ బిహైండ్ బతుకమ్మ గ్లోబల్ రీచ్' అని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్!

### అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా అడ్డుకునే యత్నం

- అందులో భాగంగానే బీఆర్ఎస్ సభ్యుడి సస్పెన్షన్
- ప్రభుత్వ వైఫల్యంపై తిరగబడుతున్న ప్రజలు, ఉద్యోగులు
- సీఎం రేవంత్‌రెడ్డిని వరుసగా చుట్టుముడుతున్న సమస్యలు
- అసెంబ్లీలో సమస్యలేవి చర్చకు రాకుండా పకడ్బందీ ప్లాన్
- మరికొంత మంది బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసే అవకాశం

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): పాలనలో వైఫల్యం.. హామీలు అమలుచేయలేని నిస్సహాయత.. ఎండుతున్న పంటలు.. నిత్యం అన్నదాతల బలవన్మరణాలు.. ఏడాదిన్నర కూడా గడవకముందే ప్రభుత్వంపై తిరగబడుతున్న ప్రజలు, ఉద్యోగులు.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ ఓటమి ఖాయమని తేల్చిన ఓ సర్వే.. దీంతో తీవ్ర అసహనానికి గురైన సీఎం రేవంత్‌రెడ్డి నోరు జారుతూ మాజీ సీఎం, ఉద్యమ నేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. దీనిపై అటు గులాబీ శ్రేణుల్లో, ఇటు ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం..వీటన్నింటి నుంచి అటు ప్రతిపక్షం, ఇటు ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ సర్కారు తన మార్కు అటెన్షన్ డైవర్షన్ డ్రామాకు తెరతీసిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే అసెంబ్లీలో ప్రజా సమస్యలేవీ చర్చకు రాకుండా ఉండేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అంశాన్ని వివాదాస్పదం చేసిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకే అసెంబ్లీ ప్రారంభమైన తొలిరోజే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేసి ప్రతిపక్షాల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నించినట్టు తెలుస్తున్నది. మొన్నటివరకు బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేయబోం అని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం మాటపై నిలవని కాంగ్రెస్ సంస్కృతికి నిదర్శనమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉంటే ప్రభుత్వాన్ని కడిగిపారేయడం ఖాయమన్న భయంతోనే కాంగ్రెస్ సర్కారు సస్పెన్షన్ అస్ర్తాన్ని ఎంచుకున్నదని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ సస్పెన్షన్ల పరంపర ఒక్క జగదీశ్‌రెడ్డితోనే ఆగదని, మరికొందరు బీఆర్ఎస్ సభ్యులు లక్ష్యంగా కొనసాగే అవకాశం ఉన్నదని అభిప్రాయపడుతున్నారు.

#### చుట్టుముట్టిన సమస్యలు...

రేవంత్‌రెడ్డి సర్కారును అన్ని వైపుల నుంచి సమస్యలు చుట్టుముట్టాయి. సామాన్య ప్రజలు, ఉద్యోగులు, రైతులు, మహిళలు ఇలా దాదాపు అన్ని వర్గాల వారు ప్రభుత్వంపై తిరగబడేందుకు సిద్ధమవుతున్నారు. హామీల అమలుపై నిలదీస్తామని అంటున్నారు. ఓవైపు పాలనలో రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతుండగా, దీనికి తోడు ఇటీవల ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ పట్ల ప్రజలకున్న భ్రమలు తొలగుతున్నట్టు వెల్లడైంది. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్‌కు గరిష్ఠంగా 21 సీట్లు మాత్రమే వస్తాయని ఆ సర్వే తేల్చింది. ఈ సర్వే ఫలితాలు కాంగ్రెస్ సర్కారులో వణుకు పుట్టించినట్టు తెలుస్తున్నది. దీనిపై పార్టీ అధిష్ఠానం పెద్దలు అసహనంతో ఊగిపోయినట్టు సమాచారం. వీటి నుంచి దృష్టి మరల్చేందుకే సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై చావు వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తున్నది. కాగా ఈ వ్యాఖ్యలు ప్రజల్లో మరింత ఆగ్రహాన్ని రగిలించాయి.

### హామీలు అమలు చేయలేం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో పథకాలు అమలు చేయలేమని చేతులెత్తేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్సలు బాగాలేదని, ఇలాంటి పరిస్థితుల్లో పథకాలు అమలు చేయడం సాధ్యం కావడం లేదనే విధంగా మాట్లాడారు. దీనిపై ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. హామీలు అమలు చేయలేమని తెలిసినప్పుడు ఎందుకు ఇచ్చారంటూ నిలదీస్తున్నారు. హామీలు ఇచ్చే ముందు ఆర్థిక పరిస్థితి గురించి తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. హామీలిచ్చి వాటితో గద్దెనెక్కి.. ఇప్పుడు మావల్ల కాదంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఉద్యోగులు సైతం సర్కారుపై పోరుకు సిద్ధమవుతున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక మహిళా జర్నలిస్టులను అరెస్ట్ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత నానాటికీ పెరుగుతుండటంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీసినట్టు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### సమస్యలేవీ అసెంబ్లీలో చర్చకు రావొద్దు...!

రాష్ట్రంలో ప్రస్తుతం సాగునీరు లేక అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి. అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరోవైపు రుణమాఫీ చేయకపోవడం, రైతుభరోసా ఎగ్గొట్టడంతో ప్రభుత్వంపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రైతులకు, ఉద్యోగులకు, ప్రజలకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ పార్టీ వారి తరపున సర్కారుపై యుద్ధం చేసేందుకు సిద్ధమైంది. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని సమస్యలపై ఎండగట్టేందుకు సమాయత్తమైంది. ప్రజా, రైతు సమస్యలు అసెంబ్లీలో చర్చకు వస్తే సమాధానం చెప్పుకోలేని స్థితిలో సర్కారు ఉంది. ఇదే జరిగితే తమ బండారం బయటపడుతుందనే ఆందోళనతోనే ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందని అంటున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ కూడా ఇందులో భాగమని పేర్కొంటున్నారు.

## పదిహేను నెలల్లో 15 స్కామ్‌లు

### సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పదిహేను నెలల కాంగ్రెస్ పాలనలో 15 స్కామ్‌లు జరిగాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతున్నదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో వచ్చిన కరెంటు, రైతుబంధు ఇప్పుడెందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ మీద కోపంతో కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను ఎండబెడుతున్నదని ఆరోపించారు. సీఎం హోదాలో రేవంత్ మాట్లాడుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని.. రాష్ట్రాన్ని తేవడంతోనే కేసీఆర్‌కు కొండంత పేరొచ్చిందని గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. రైతుబంధు రావడం లేదని ప్రశ్నించిన ఓ రైతు వీడియోను షేర్ చేసినందుకు జర్నలిస్టులను అరెస్ట్ చేశారని.. ఇది ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్ అని ధ్వజమెత్తారు.

## ఏ శిక్షకైనా బీఆర్ఎస్ సిద్ధం

### మండలిలో మధుసూదనాచారి వర్సెస్ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చ సందర్భంగా శాసన మండలిలో రేషన్‌కార్డులపై వాడీవేడిగా చర్చ జరిగింది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలు, సబ్బండ వర్గాలకు ఏమీ చేయలేదని పదేపదే మాట్లాడటంతో మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి కలుగజేసుకున్నారు. 'జీవన్‌రెడ్డి గారు తమ ప్రభుత్వం గురించి చెప్పుకోవడంలో తప్పు లేదు. కానీ అదేపనిగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏమీ జరగలేదని చెప్పడాన్ని సహించేది లేదు. మా ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు.. అది వాస్తవమని నిరూపిస్తే.. సభ చైర్మన్‌గా మీరు ఎటువంటి శిక్ష విధించినా దానిని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాం' అని చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కోరారు. '

## గవర్నర్ ప్రసంగం అబద్ధాల పుట్ట

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 13 (నమస్తేతెలంగాణ): గవర్నర్ ప్రసంగంలో అన్నీ అబద్ధాలే ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి విమర్శించారు. శాసనమండలిలో గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పుడు ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతు భరోసా, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయనేలేదని, వరికి బోనస్ చెల్లించలేదని ధ్వజమెత్తారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి చెల్లించాల్సిన నిధులు కూడా సక్రమంగా చెల్లించడం లేదని, అయినా అన్నీ అమలు చేస్తున్నట్టు గవర్నర్‌తో అవాస్తవాలను చెప్పించారని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తొలి సీఎంగా కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించారని, ఆయనను మించి తెలంగాణను ప్రేమించే వారు మరొకరు లేరని స్పష్టంచేశారు. నాడు కేసీఆర్ పదేండ్లు సాగు, తాగునీటి సమస్యలే లేకుండా చేస్తే, నేటి కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో వేలాది ఎకరాల పంటపొలాలు ఎండుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

## మా ఘనతనూ గవర్నర్‌తో చెప్పించారు

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు



హైదరాబాద్, మార్చి 13 (నమస్తేతెలంగాణ): గవర్నర్‌తో రాష్ట్ర ప్రభుత్వం అన్నీ అబద్ధాలనే చెప్పించిందని, చివరికి బీఆర్ఎస్ హయాంలో చేసిన ఘనతను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్టు చెప్పించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించారు. మండలిలో గవర్నర్ ప్రసంగంపై చర్చలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రైతు వేదికలను బీఆర్ఎస్ హయాంలో నిర్మిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించినట్టు చెప్పుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 2,02,725 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి 1,60,083 ఉద్యోగాలను భర్తీ చేసినట్టు వివరించారు. మరో 42,652 ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వాటి నియామకంలో జాప్యం జరిగిందని, వాటికి ఇప్పుడు నియామక పత్రాలిచ్చి కాంగ్రెస్ 50 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసినట్టు చెప్పుకున్నదని విమర్శించారు. తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను తూలనాడటం మాని, ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## నిధులే లేనప్పుడు స్కూళ్లు ఎలా కడతారు?

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



హైదరాబాద్, మార్చి 13 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వంలో నిధులే లేనప్పుడు రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలను ఎలా నిర్మిస్తారు? అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి, పెండింగ్ బిల్లులు చెల్లించడానికే ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నట్టు చెప్పుకున్నదని ఈ సందర్భంగా తెలిపారు. గురువారం గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని, ఇలాంటి పరిస్థితుల్లో వాటిని చక్కదిద్దాలని, కొత్తగా ఇంటిగ్రేటెడ్ గురుకులాల నిర్మాణం పేరుతో ఉన్న నిధులను దుర్వినియోగం కాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. పక్కా పాఠశాల భవనాలు ఉన్న చోట పిల్లలు లేరని, పిల్లలు ఉన్న చోట టీచర్లు లేరని ఇలాంటి సమస్యలను సరిచేయాలని కోరారు. టీచర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## పాలన చేతగాకుంటే ఎన్నికలకు వెళ్లండి!

- బీజేపీఎల్పీ నేత ఏలేటి ఫైర్
- ప్రజల్లోకి వెళ్లేందుకు రెడీ: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, మార్చి 13(నమస్తే తెలంగాణ): 'ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలిచ్చి, ఇప్పుడు చేతగాదంటూ తప్పించుకోవడం ఏమిటి? మీకు పాలన చేతకాకుంటే మళ్లీ ఎన్నికలకు వెళ్లండి' అని కాంగ్రెస్ సర్కార్‌కు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. 14 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింట్లో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై గురువారం ఆయన మాట్లాడారు. ఇది పాపాల కాంగ్రెస్ పాలన అంటూ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కారు ఏడాదిలోనే 1.5 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లపై చట్టబద్ధత చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదంటూ మండిపడ్డారు. మహేశ్వర్‌రెడ్డి సవాల్‌ను మంత్రి శ్రీధర్‌బాబు స్వీకరించారు. పొరుగు రాష్ట్రంలో బీజేపీ భాగస్వామ్యంతో ఉన్న ప్రభుత్వం తమ కన్నా ఎక్కువ ఏమి చేస్తున్నదో పోల్చుకొని చూడాలని కోరారు. మళ్లీ ప్రజల్లోకి వెళ్లేందుకు తామూ రెడీ.. సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. అని ప్రతిస్పందించడం గమనార్హం.

## మంత్రులు హోంవర్క్ చేయడం లేదు

- ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడంలో ఫెయిల్
- అసెంబ్లీలో సీపీఐ పక్షనేత కూనంనేని వెల్లడి



హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి మంత్రులెవ్వరూ హోంవర్క్ చేయడంలేదని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఫెయిలయ్యారని శాసనసభలో సీపీఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ సమగ్రంగా అమలు చేయాలని కోరారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. ఒకవైపు కేంద్రం నుంచి ఏపీ నిధులు రాబట్టుకుంటుంటే.. తెలంగాణ సర్కారు ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. పోలవరానికి జాతీయ హోదా ఇవ్వడంతోపాటు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కూడా టేకప్ చేశారని, కానీ బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ మీద కేంద్రానికి పట్టింపే లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈక్రమంలోనే దక్షిణాది రాష్ట్రాలన్నీ ఒక సమాఖ్యగా ఏర్పాటు కాబోతున్నాయని ఆయన స్పష్టంచేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జే మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ప్రతి జిల్లాకు వస్తుందని తెలిపారు. వైఎస్సార్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. గ్లోబల్ కెపాబులిటీ సెంటర్, సెమికండక్టర్ వంటి పరిశ్రమలు త్వరలో రాబోతున్నాయని ఆయన స్పష్టం చేశారు..

## నన్ను మంత్రిని చేస్తే పార్టీకే లాభం: రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్,మార్చి 13 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం అసెంబ్లీలో ఆయన మీ డియాతో మాట్లాడారు. తనకు మంత్రి పదవి వస్తుందని ఎన్నడూ చెప్పలేదని స్పష్టంచేశారు. భువనగిరి ఎంపీ స్థానం కోసం తాను నిద్రాహారాలు మాని పార్టీ అభ్యర్థిని గెలిపించానని చెప్పారు. తనకు మంత్రి పదవి ఇస్తే అది పార్టీకి, ప్రజలకే లాభమని తెలిపారు. మంత్రి పదవి ఆశించి తాను ఏ పనులూ చేయనని పేర్కొన్నారు.

# గాంధీలకు నేను చాలా దగ్గర!

- సమావేశమైన ఫొటోలు చూపాల్సిన అవసరంలేదు
- ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో రేవంత్ వ్యాఖ్యలు
- ఓ వైపు అధిష్ఠానంతో అనుబంధం చెడిందన్న ప్రచారం
- రేవంత్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వట్లేదంటూ వార్తలు
- రాహుల్ 'సిద్ధాంతం' వ్యాఖ్యలతో ఆత్మరక్షణలో ముఖ్యమంత్రి



న్యూఢిల్లీ, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ఎవరినైనా ఏదైనా వివరణ అడిగితే.. స్పష్టత ఇస్తారు. కానీ అడగకుండానే పిలిచిమరీ వివరణ ఇస్తే.. కొత్త అనుమానాలు వస్తాయి. ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఇలాంటిదే ఓ చర్చ నడుస్తున్నది. ఢిల్లీకి 39వసారి వెళ్లిన రేవంత్‌రెడ్డి, విదేశాంగమంత్రి జైశంకర్‌తో సమావేశమైన తర్వాత మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. రాజకీయాలపై పలు అభిప్రాయాలు వెలిబుచ్చారు. సోనియాగాంధీ కుటుంబంతో తనకు చాలా అనుబంధం ఉన్నదని చెప్పుకున్నారు. ఇది నిరూపించుకోవడానికి ఫొటోలు చూపించాల్సిన అవసరంలేదని వ్యాఖ్యానించారు. అయితే "కనీసం ఈ సారైనా అధిష్ఠానం పెద్దలెవరితోనైనా సమావేశమయ్యారా? అపాయింట్‌మెంట్ దొరికిందా? అనే ప్రశ్నలు ఎవరైనా అడుగుతారని భావించారో ఏమో..! అందుకే తాను సోనియాగాంధీ కుటుంబానికి అత్యంత దగ్గరి మనిషిని అని,అధిష్ఠానంతో అనుబంధం ఉన్నదని చెప్పుకున్నారు." అని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది.

#### ఏ ఉద్దేశంతో అన్నారో!

ఇటీవల ఢిల్లీలో పడిగాపులుకాసినా రేవంత్‌రెడ్డికి అధిష్ఠానం పెద్దలెవరూ అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని కాంగ్రెస్‌లోనే ప్రచారం జరుగుతున్నది. అంతేకాకుండా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక వ్యవహారంలో అధిష్ఠానమే రంగంలోకి దిగినట్టు స్పష్టమవుతున్నది. సీఎం సిఫారసు చేసిన ప్రతిపాదనలు, ముఖ్యంగా తనకు అత్యంత సన్నిహితుడు, ప్రభుత్వ ముఖ్యసలహాదారు వేం నరేందర్‌రెడ్డికి కూడా అధిష్ఠానం అవకాశం ఇవ్వలేదు. సీఎం, హైకమాండ్ మధ్య గ్యాప్‌పై స్పష్టత వచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేశారు.

#### గుండెజారి గల్లంతయ్యిందా?

ఢిల్లీలో కాంగ్రెస్, గల్లీలో కాంగ్రెస్ భిన్నవాదనలు వినిపిస్తున్నదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. రాహుల్ గాంధీ వ్యతిరేకించే అదానీతో రేవంత్ అంటకాగడమే ఇందుకు నిదర్శనమే విమర్శలు ఉన్నాయి. ఢిల్లీ వెళ్లిన ప్రతీసారి మోదీతో, కేంద్రమంత్రులతో సఖ్యతగా సమావేశం కావడం, రాష్ట్రంలో బీజేపీతో కాంగ్రెస్‌కు పొత్తు ఉన్నదేమో అన్నంతగా స్నేహ సంబంధాలు నెరుపుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఇండియాటుడే సదస్సులో పాల్గొన్న రేవంత్ పదేపదే మోదీ నామస్మరణ చేయడం చర్చనీయాంశంగా మారింది. అధిష్ఠానాన్ని బ్లాక్ మెయిల్ చేయడం కోసమే రేవంత్ ఇలా మాట్లాడారనే ఆరోపణలున్నాయి. గుజరాత్‌లో కాంగ్రెస్ నేతల సమావేశంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. కాంగ్రెస్‌లో రెండు రకాల వాళ్లు ఉన్నారని, కొందరు కాంగ్రెస్ భావజాలం కలిగిన వాళ్లు కాగా, మరికొందరు కాంగ్రెస్‌లో ఉన్నా మనసంతా బీజేపీలో ఉంటుందని విమర్శించారు. అలాంటివాళ్లను బహిష్కరిస్తామని తేల్చిచెప్పారు. ఈ వ్యాఖ్యలు రేవంత్‌ను ఉద్దేశించి చేసినవేనని ప్రచారం జరిగింది. అందుకేనేమో గురువారం ఢిల్లీలో జరిగిన చిట్‌చాట్‌లో రేవంత్ మాట్లాడుతూ తాను ఎవరి ట్రాప్‌లోనూ పడబోనని వ్యాఖ్యానించి ఉంటారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎవరు ఎటువంటి ప్రచారం చేసినా ఇబ్బంది లేదని చెప్పుకొచ్చారు. అడగకుండా ఇచ్చిన వివరణ కొత్త అనుమానాలకు తావిస్తున్నది. రాహుల్ వ్యాఖ్యలతో రేవంత్ గుండెజారి గల్లంతయ్యిందేమోనని, అందుకే వివరణ ఇచ్చుకుని ఉంటారని పేర్కొంటున్నారు.

#### ఏడాదిలో ఏం చేశానంటే!

తెలంగాణలో ఏడాది పాలనలో నిరుద్యోగాన్ని 8.8 శాతం నుంచి 6.2 శాతానికి తగ్గించగలిగానని చిట్‌చాట్‌లో రేవంత్ చెప్పుకొచ్చారు. రూ.2.2 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు తీసుకొచ్చినట్టు వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి కేంద్రమంత్రివర్గంలో ఉన్నారని, కానీ ప్రాజెక్టులు సాధించాలని కోరితే పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. తెలంగాణలో ఏప్రిల్‌లో మూడు రోజులపాటు 'భారత్ సమ్మిట్' పేరుతో సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన అనుమతుల కోసమే విదేశాంగమంత్రి జైశంకర్‌తో భేటీ అయినట్టు వివరించారు. నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణలో అందరి అభిప్రాయాన్ని సేకరించిన తర్వాత చెన్నైలో డీఎంకే నిర్వహించే మీటింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చెప్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు.

## అధికారుల నిర్వాకంతో సర్కారుకు చెడ్డపేరు

- ఎమ్మార్వో నుంచి ఐఏఎస్ దాకా పనిచేయడంలేదు
- పనితీరు మార్చుకోవాలని హెచ్చరించిన టీపీసీసీ చీఫ్



హైదరాబాద్ ,మార్చి 13 (నమస్తే తెలంగాణ): 'అధికారులపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయి.. రాష్ట్రంలో ఎమ్మార్వో నుంచి ఐఏఎస్ దాకా సక్రమంగా పనిచేయడం లేదు.. అలసత్వం ప్రదర్శిస్తున్నారు.. వారి పనితీరు మార్చుకోవాలని హెచ్చరిస్తున్న' అంటూ టీపీసీసీ అధ్యక్షుడు టీ మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ నాయకులైనా, అధికారులైనా ప్రజలిచ్చే డబ్బులతో పనిచేస్తున్నామనే విషయం మరువరాదు.. వారి వైఖరితో సర్కారుకు చెడ్డ పేరు వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. అధికారులు పనితీరు మార్చుకోకుంటే ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తుందని హూంకరించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలోనే ఈ విధంగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. కాగా, పీసీసీ చీఫ్ వ్యాఖ్యలపై ఉద్యోగ సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆడలేక మద్దెలు ఓడు చందంగా ఆయన వ్యాఖ్యలున్నాయని ఆగ్రహించారు. ఆయన ఏ హోదాలో ఈ విధంగా మాట్లాడారని ప్రశ్నిస్తున్నారు.


స్థాపితం: 20-12-1957 | వ్యాపార ప్రారంభం: 17-04-1958

**హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్**

RBI Licence No. RPCD(H) Coop.6/05.08.03/2011-12

నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్-500001 (రి.నం.21603)

**సర్వసభ్య సమావేశపు నోటీసు**

తేది.22-03-2025 శనివారము రోజున ఉదయం గం|| 11:30 ని||లకు బ్యాంకు యొక్క సర్వసభ్య సమావేశము హోటల్ తులిప్స్, సాగర్ రోడ్, తుర్కయంజాల్‌లో నిర్వహించుటకు/జరుపుటకు బ్యాంక్ పాలకవర్గము వారు నిర్ణయించడమైనది. కావున సభ్యులెల్లరు తప్పక హాజరు కావలయునని కోరడమైనది.

స్థలము: హైదరాబాద్ | సం/- ముఖ్య కార్యనిర్వాహణ అధికారి


## 'మావోళ్లు అట్ల అదుపుచేస్తరు.. మీరేమో ఇట్ల..': జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): శాసన మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి ఎక్కువ సమయం మాట్లాడుతుండగా మధ్యలో చైర్మన్ కలుగజేసుకున్నారు. 'జీవన్‌రెడ్డిగారు మీరు ఇప్పటికే ఎక్కువ సమయం తీసుకున్నారు..' అని చైర్మన్ అన్నారు. 'సార్ నేను మళ్లీ ఉంటనో ఉండనో.. పోయేముందు కూడా ఇవే గంటలు కొట్టుడా సార్. మీరే చెప్పండి. మీరు ఎట్ల అంటే అట్లనే సార్. మావోళ్లేమో అట్ల అదుపు చేస్తున్నారు.. మీరేమో ఇట్ల అదుపు చేస్తున్నారు' అని జీవన్‌రెడ్డి సీరియస్‌గానే అన్నారు.

## ఉచితాలను రద్దు చేయండి: ఏవీఎన్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఉద్యోగులకు ఇవ్వాల్సినవి ఇవ్వకుండా దాచుకుంటే ప్రభుత్వం అభాసుపాలవుతుందే తప్పా.. వారికి ఒరిగేదేమీ ఉండదు. ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే.. ఉచితాలను రద్దు చేయండి. వాటిని ఎవరు అడుగుతున్నారు?' అని ఏవీఎన్ రెడ్డి ప్రశ్నించారు.


